# బంధం అనుబంధం

-కందుకూరి వెంకట మహాలక్ష్మి

"డాక్టర్ గారూ! నా పార్వతి నన్నిలా వదిలేసి వెళ్ళిపోదండీ! నా పార్వతి పోయిందంటే నేను నమ్మనండీ. ఒక్క ఇంజక్షనేదన్నా యిచ్చి చూడండి డాక్టర్‌గారూ" అంటూ అతని చేతులు పట్టుకుని బ్రతిమాలుతున్న శంకరయ్య వంక జాలిగా చూశాడు డాక్టర్ రాజా.

"ఈ వయస్సులో ఏ రోగమూ లేకుండా సునాయాసంగా పోయిన ఆ మహాయిల్లాలి శరీరాన్ని ఎందుకండీ సూదులు గుచ్చి హింసించడం? అదృష్టవంతురాలా తల్లి. అటువంటి చావు అందరికీ రాదు" అంటూ అక్కడి నుంచి నిష్క్రమించాడు డాక్టర్ రాజా.

గంటలో ఆ వార్త ఊరంతా పాకిపోయింది. ఊళ్ళో జనమంతా వచ్చారు. దూరాన వున్న కోడలికి టెలిగ్రామిచ్చారు. అందిన వెంటనే విమానంలో బయలుదేరి వచ్చేసింది నీరజ అయిదేళ్ళ అశోక్‌తో.

"ఊరుకోండి మామయ్యగారూ! ఎన్ని కష్టాలొచ్చినా ఎంతో ధైర్యంతో ఎదుర్కొని మాకు ధైర్యం చెప్పిన మీరే ఇలా బాధపడితే ఎలాగ? మీ ఆసరా చూసుకునే నేను బ్రతుకుతున్నాను. ధైర్యం తెచ్చుకోండి!" అని మామగారికి ధైర్యం చెప్తూ దుఃఖం ఆపుకోలేక పక్కకి తిరిగి తనూ బాధపడసాగింది నీరజ.

పార్వతమ్మ శరీరం వీధి అరుగుమీద స్మశానానికి తీసుకువెళ్ళడానికి సిద్ధంగా వుంది. పండు ముత్తయిదువు పార్వతమ్మ ముఖం పసుపుతో పండిపోయి వుంది. అర్ధరూపాయ కాసంత కుంకుమ బొట్టూ, కళ్ళకి పెట్టుకున్న కాటుకా ఆమె పునిస్త్రీ తనానికి నిదర్శనగా చెక్కుచెదరకుండా వున్నాయి.

జరగవలసిన తతంగం జరుపుతున్నారు బంధుమిత్రులు. శంకరయ్య మాత్రం పార్వతమ్మ పక్కనుంచి కదలకుండా చంటి పిల్లాడిలా విలపిస్తున్నాడు.

కోడలి రాకకోసమే అంతవరకు ఆపు చేసిన ఆమె శరీరాన్ని మరో గంటలో తీసుకెళ్ళి దహన సంస్కారాలు జరిపిస్తారు. ఇది తల్చుకోగానే శంకరయ్య గుండె ఝల్లుమంది. "డాక్టర్ ప్రాణం పోయిందంటేనే నమ్మలేదు. అలాంటిది యిప్పుడు ఆమెని తన నుంచి శాశ్వతంగా దూరం చేస్తారంటే భరించేదెలా? ఆమె మృతదేహాన్ని అంటిపెట్టుకుని కూర్చున్న నా నుంచి ఆ మృతదేహాన్ని కూడా తీసుకెళ్ళిపోతారన్నమాట. ఆమె లేకుండా ఎలా బ్రతకడం? ఆమె అండ చూసుకుని ఎన్ని ఎదురుదెబ్బల్ని తట్టుకుని బ్రతుకుతున్నాను" అంటూ రెట్టింపయిన దుఃఖంతో గోల గోల పెడుతున్నాడు.

పెళ్ళినాటికి తనకి పన్నెండేళ్ళు- పార్వతి వయసెంతో తెలీదు. తను ఇంటర్ చదువుతుండగా పార్వతి కాపరాని కొచ్చింది. తమది పెద్ద కుటుంబం. అత్త మామల మధ్య, ఆడబిడ్డల, మరుదుల మధ్యకి చిన్న వయసులోనే అడుగెట్టిన పార్వతి ఎప్పుడూ అత్తగారి వెనక వంటింట్లో చాకిరీకి అలవాటు పడిపోయింది. పై ఊళ్ళో చదువుతున్న తను సెలవలకి ఇంటికొచ్చినప్పుడు కూడా ఏ రాత్రికో గానీ తన దగ్గరకొచ్చేది కాదు.

పార్వతి కాపరానికొచ్చాకనే ఆడబిడ్డలకీ, మరుదులకీ పెళ్ళిళ్ళయ్యాయి. పై ఊళ్ళల్లో ఉద్యోగాలు చేసే మరుదులు వారి వారి భార్యలతో వెళ్లిపోయారు. ఊళ్ళోనే ఉద్యోగం చేసే తనూ, పార్వతే మిగిలారా ఊళ్ళో.

ఆడపిల్లలు అత్తవారిళ్ళకెళ్ళినా పండగల పేరిట, పురుళ్ళ పేరిట వస్తూనే వుండేవారు. పెళ్ళివారిల్లులా ఎప్పుడూ నిండుగా వుండే ఆ ఇంటి పెద్ద కోడలిగా పార్వతికి ఎప్పుడూ ఊపిరి సలిపేది కాదు. ఎందరు కోడళ్ళు వచ్చినా పార్వతి "ఇది నా పని- అది నీ పని" అని ఎప్పుడూ అనుకునెరగదు. కల్మషమెరుగని సాధ్వి పార్వతి. అత్తమామలకి పార్వతంటే ఒక దేవతే! ఆమె కనపడని క్షణం వారికి తోచేది కాదు. కాలం స్తంభించిపోయినట్లు ఏ పన్లూ జరిగేవి కావు. ఆమె పెత్తనం, ఆమె సలహా ప్రతీ పనిలో, మాటలో వారికి అవసరమైనప్పటికీ పార్వతి వారి పెద్దరికాలని గౌరవిస్తూ అన్నీ తనే అయి చూసుకునేది. ఆమె అడు గెట్టిన రోజు నుంచి అత్తమామలు గతించే వరకూ అదే పద్ధతిలో ఆ ఇంటిని నడిపి 'ఓహో' అనిపించుకున్న మహా ఇల్లాలు పార్వతి.

అయిదుగురు బిడ్డల్ని కన్న పార్వతి ఆఖరికి ఒక్కడినే దక్కించుకున్న తల్లి అయింది. ఆ పసికందునే ఎంతో అల్లారుముద్దుగా పెంచసాగారా దంపతులు.

తండ్రి పోయిన తరువాత కొడుకులికి మిగిల్చిన ఆస్తిలో వాటా శంకరానికి రెండెకరాలు వచ్చాయి. టీచర్‌గా వచ్చే జీతం ఖర్చులకి పోగా రెండెకరాల

మీద వచ్చే గింజల్ని తిండికి తెచ్చుకునేవారు. కొడుకు వాసు కాలేజీ చదువుకెళ్ళేదాకా శంకరయ్య జీవితం సాఫీగానే సాగింది. కొడుకు పైవూరి చదువు వీరి జీవిత గమనంలో మార్పుని తీసుకొచ్చింది. ఇటు ఇంటికి పెద్ద కొడుగ్గా తన వారిని చూసుకుంటూ, అటు కొడుక్కి నెలనెలా ఖర్చులకి పంపడం ఇబ్బందిగానే వుండేది. అలా అని వున్న ఒక్క కొడుకుని చదివించకుండా కూర్చోపెట్టడమూ యిష్టముండేది కాదు. అందునా వాసు చిన్నప్పటి నుంచి అన్నింటిలోనూ ఫస్టే వచ్చేవాడు. కనీసం డిగ్రీ అయినా చెప్పించాలన్నది వారి కోరిక. ఎంతయినా కష్టపడి కొడుకుని చదివించి, ఉద్యోగస్తుడిని చేస్తే వాడి పంచన తాము కూడా చల్లగా బ్రతకొచ్చని నిశ్చయించుకున్నారు. దాంతో ముందు ఓ ఎకరాన్ని అమ్మి ఇంటర్ చెప్పించారు. తర్వాత వున్న రెండో ఎకరం అమ్మి కొంత అప్పుచేసి బి.కాం. పూర్తి చేయించారు. ఈ మధ్య కాలంలో ఆ దంపతులు ఎలా గడుపుకున్నారన్నది వారొక్కరికి మాత్రమే తెలుసు.

వాసు బి.కాం. పాసయిన కొద్ది కాలానికే అతనికి వేరే ఊళ్ళో బ్యాంకులో ఉద్యోగం రావడం, మరికొన్ని రోజులకే వివాహం చెయ్యడం జరిగింది. వాసు భార్య నీరజ కూడా చాలా అణకువ గల పిల్ల. పార్వతమ్మ కోడల్ని కూతురికన్నా ఆప్యాయంగా చూసుకునేది. వారి మధ్య అనుబంధం తల్లి, పిల్లల్లా వుండేది.

వాసూ-నీరజలు ఉద్యోగం చేసే వూరు వెళ్తూ అత్త మామల్ని తమ దగ్గరకొచ్చేసి వుండమని బలవంతం చేసి వెంట తీసుకెళ్ళారు. నెల జీతం రాగానే తల్లి తండ్రులకి నాలుగొందలిచ్చి ఖర్చు చేసుకోమనేవారు. తనకొచ్చే పెన్షన్, కొడుకు యిచ్చే డబ్బులతో వున్న అప్పులన్నీ తీర్చుకుంటూ వారి జీవితాల్ని కొడుకు, కోడలు మధ్య నిశ్చింతగా గడపసాగారు.

అప్పులన్నీ తీరిపోయాయి. వాసుకి ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చింది. మనవడు కూడా పుట్టడంతో ఆ దంపతులు పార్వతమ్మ, శంకరయ్యలయ్యారు. ఇంక నిశ్చింతగా తాము దేముడి పిలుపు కోసం ఎదురు చూడొచ్చని, తమ కష్టం యొక్క ఫలితం దక్కిందని ఆనందించేవారు. మనవడితోపాటు తాము చిన్న పిల్లలై ఆడుకోడమే వారి దినచర్య.

వారి ఆనందాన్ని చూసి ఓర్వలేని కాలం పాల బిందెలో ఉప్పురాయి వేసినట్లుగా ఆ కుటుంబంలోంచి వాసుని శాశ్వతంగా లాక్కెళ్ళిపోయింది.

మానవుడు అనుకున్నవన్నీ అనుకున్నట్లు జరిగిన

## త్రినాథరాజు నానీలు

బండలాంటి మనసులూ / కరుగుతున్నాయి
నానీలు / రాజ్యమేలుతున్నాయిగా...

ఆధారం తెగి / పట్టాలు తప్పింది రైలు
ఆర్తనాదాలతో / బంధాలూ తెగాయి

డొక్కలెండినా / బట్ట చచ్చినా
కళా ధనికుడే / చేనేత కళాకారుడు

స్వదేశీ విధానం / అమ్మ పాల్లాంటిది
విదేశీ వ్యామోహం / డబ్బా పాల్లాంటిదే

క్లాసు ఎల్‌కెజి / పుస్తకాల బరువు
తన బరువు కంటే / రెండింతలు

గవర్నమెంట్ స్కూలు / పిల్లలు లేక
నిలబడింది / కాన్వెంట్ మోజు కదా!

నేటి పల్లెసీమ / ముందు తరాలకు
పేదరాసి పెద్దమ్మ కథ / కాకూడదు.

మనసును / మడత పెట్టేందుకు
ప్రయత్నించకు / రాజీపడినట్టవుతుంది

మొన్నటివరకూ / కునికిన మేఘాలు
నిద్రపోవటం లేదు / రైతేం కానూ...

గాల్లో / మేడ కట్టావు
కన్నోళ్ళ గుండెలు రోదించాయి
విదేశీ వ్యామోహీ మేల్కో

అమ్మాయిపై నీ ప్రేమ / నీలో మనసుదా?
నీలో 'మనీ'’షి' దా? / ప్రశ్నించుకో...

శత్రువు / ఆపదలో పడ్డాడని
మురిసిపోకు / మానవత్వాన్ని గుర్తుంచుకో

ఉదయాన్నే / వళ్ళు విరుచుకుంటూంటే...
సూర్య కిరణాలు / కర్తవ్యాన్ని గుచ్చాయి

డబ్బు సంచిని / చంటోడ్ని
చెరో బుజాన్నేసుకున్నాడు
చదువు కొంటానికి.

సాహిత్య కుండలో / అక్షర రాళ్ళేశా...
కవిత్వం పైకొచ్చింది
ఆస్వాదిస్తున్నాను.

మిత్రునికి ప్రేమగా
రాశానో ఉత్తరం
రిప్లై వచ్చింది
ఫోన్ చెయ్యంటూ...

-కొత్తపల్లి త్రినాథరాజు

నాడు మరణాన్ని కూడా జయించగలడేమో! ఏడా దంతా కష్టపడి పండించుకుని, గింజ గింజ పోగేసుకున్న ధాన్యపు రాశి ఉప్పెనొచ్చి కొట్టుకుపోయినట్లు, ఎంతో శ్రమపడి ఇటుక మోసి కట్టుకున్న ఇంటిని భూకంపం నేలమట్టం చేసినట్లు ఆ ఇంటికి వెన్నెముకయిన వాసుని గెద్దలా తన్నుకుపోయింది విధి. అటు భార్యా కొడుకుని, ఇటు ముసలి తల్లితండ్రుల్ని దిక్కులేని వారిని చేసి వాసుకు నూరేళ్ళు నిండిపోయాయి. మీ ఖర్మానికి మీరు బాధపడండంటూ ఎవ్వరి గురించీ ఆలోచించకుండా వెళ్ళిపోయిన వాసు కోసం ఇంట్లో అంతా ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయిన రోజు కూడా శంకరయ్య ధైర్యంగా కోడల్ని, భార్యని ఊరడించి 'మనకి యింతే ప్రాప్తం' అన్న వేదాంతాన్ని బోధించేవాడు.

పదమూడో రోజు నీరజ తల్లితండ్రులొచ్చి తల్లీ, కొడుకుని తీసుకెళ్ళిపోయారు. కొడుకు చేతిలో బూడిదవ వలసిన ఆ వృద్ధ దంపతులు అల్లారుముద్దుగా పెంచిన చేతులతోనే కొడుకుని బూడిద చేయవలసి రావడం తట్టుకోలేకపోయారు. "మిగతా పిల్లల్లా పుట్టగానే నువ్వూ పోయివుంటే ఇంత బాధుండేది కాదేమో!"

# నానీలు

**చే**తిలోనైతే
ఎంసెట్ పుస్తకాలు
మైండ్ సెట్‌లోనేమో
ర్యాంకుల చక్రాలు
ముద్దులు మూటగట్టే
పిల్లలు
ఏడ్చినా నవ్వినా
ముత్యాల జల్లులు
గుల్‌మోహర్ చెట్లు
బడి వాకిట్లో
పూలు చల్లుతూ
స్వాగతం చెప్తూ...
ప్రకృతి ఒడి
ప్రతిదీ స్పందనే
కంప్యూటర్ కాలం
కరువైన మానవత్వం

-కందేపి రాణీప్రసాద్

అని ఏడ్చేది పార్వతమ్మ. "ఇంత తెలివి, ఇంత మంచి తనం, ఇంత ప్రేమ అన్నీ కలిపి నీలో నింపింది ఈ రకంగా మా కడుపులో చిచ్చు పెట్టడానికా బాబూ!" అంటూ లోలోన కుళ్ళిపోయేవాడు శంకరయ్య.

మళ్ళీ గుండె బరువుతో విధికి తలొగ్గి సొంత వూరికి తిరిగొచ్చారా దంపతులు. మళ్ళీ వారి పరిస్థితి మొదటికొచ్చింది. వెనక నయాపైస లేదు. వృద్ధాప్యం వల్ల తిరగలేకపోతున్న శంకరయ్య ఏ పని చెయ్యగలడు? అలాగే ఇద్దరు ముగ్గురు పిల్లలకి ఇంటి దగ్గర పాఠాలు చెప్పాలని పాటుపడేవాడు. ఊళ్ళో పెద్దలు వాళ్ళ బాధని అర్థం చేసుకుని సహాయ పడటానికి ప్రయత్నించే వారు. ఇన్నాళ్ళూ వీరి వల్ల అన్నీ పొందిన బంధువులు మాత్రం పలకరిస్తే అంటుకుంటారేమో!" అన్నట్లు దూరంగానే వుండజొచ్చారు.

నీరజకి వాసు పనిచేసిన బ్యాంకులోనే ఉద్యోగ మిచ్చారు. ఉద్యోగంలో చేరిన కొద్ది కాలానికి అత్త మామల్ని తన దగ్గరకి వచ్చెయ్యమని, తన్నే కొడుకుగా భావించి, తనకి పెద్ద దిక్కుగా వుంటే ధైర్యంగా వుం టుందని ఉత్తరం రాసింది. లింకు తెగిన గొలుసది. ఆప్యాయతలు చావవు కానీ స్వతంత్రంగా వెళ్ళి వుండ లేని చోటయింది. 'ఏ ముఖం పెట్టుకుని కోడలి సంపా దన తినడానికి వెళ్తాము?' అనుకుని నీరజ ఆప్యాయతకి ఆనందాన్ని వెలిబుచ్చుతూ ఉత్తరం రాసివేశారు.

ఫస్టు తారీఖు రాగానే నీరజ వద్ద నుంచి వచ్చిన వంద రూపాయల మనియార్డరు అందుకున్న శంకరయ్య హృదయం ఆర్ద్రమయింది. కోడలి మంచితనానికి మరో నిదర్శనం అనుకున్నారిద్దరు. ఆ దంపతుల మంచితనా నికి ఊరంతా వారిని గౌరవించేవారు. ఏదోవిధంగా సహాయపడేవారు. కానీ వారి దుఃఖాన్ని ఎవరు తీర్చ గలరు.

చచ్చినవారితో చావలేము. తినక తప్పదు. తను తింటేగానీ భర్త తినడు. అందుకు యాంత్రికంగా వంట చేసేది. కానీ సముద్రపు కెరటాల్లా తన్నుకొచ్చే దుః ఖాన్ని ఆపుకోలేక విలపించని ఘడియ వుండేది కాదు. భార్య బాధని చూడలేని శంకరయ్య పార్వతికి ధైర్యం చెప్పేవాడు.

చూడు పార్వతి నీకు జ్ఞానం రాకముందు నాకు భార్యవయ్యావు. జ్ఞానం వచ్చిన దగ్గర నుంచి మనిద్దరం కలిసి ఒకేచోట వుండి కష్టాలని, ఆనందాన్ని పంచు కున్నాం. ఈ పిల్లలు మనకి మధ్యలో వచ్చారు. మన పిల్లాడు మనపట్ల భక్తి గౌరవాలు కలవాడవటం వల్ల

ఇంత దుఃఖానికి కారణమయింది. కొన్ని కుటుంబాల్లో లాగ కొడుకులు రెక్కలు రాగానే తల్లితండ్రుల్ని మర్చిపోయి, దూరంగా వెళ్ళిపోయి వుంటే మనం ఒంటరిగా వుండవలసిన వాళ్ళమే కదా! పిల్లల్ని కంటాం, పెంచుతాం. అది మన డ్యూటీ. ఆడపిల్లలు పెళ్ళిళ్ళయి వెళ్ళిపోతారు. కొడుకులు ఉద్యోగాల పేరిట వెళ్లిపోతారు. ఆఖరికి మిగిలేది భార్యాభర్తలే! మన దురదృష్టంకొద్దీ విధి వక్రించి మన వాసు మనకి శాశ్వతంగా దూరమయ్యాడు. ఎవ్వరూ తీర్చలేని లోటే! ఉన్న మనిద్దరం కాలం గడుపుకోక తప్పదు. నువ్విలా బాధపడుతుంటే నేను తట్టుకోలేను. నా కోసం దుఃఖాన్ని దిగమింగుకుని తిరుగు" అని ఓదార్చేవాడు.

పాతివ్రత్యానికి మారుపేరయిన పార్వతమ్మకి భర్తే సర్వస్వం. శంకరయ్య సేవే ఆమె దినచర్య. ఆమెని ఆనందంగా వుంచడమే అతని దైనందిన కార్యక్రమం. అలా బ్రతుకుతున్న ఆ దంపతుల మధ్య మళ్లీ చిచ్చు పెట్టింది కాలం. ఏ రోగంతో తీసుకోకుండా, ఏ అనుమానం రానీకుండా అకస్మాత్తుగా కళ్ళుమయ్యడంతో శంకరయ్య తట్టుకోలేకపోతున్నాడు.

గతాన్ని తల్చుకుని దుఃఖిస్తున్నాడు. ఈ వయసులో నాకు దిక్కెవరు? పార్వతి దగ్గరున్న స్వతంత్రం ఎవరి దగ్గర వుంటుంది. దాని చేతుల్లో నేనెందుకు కళ్ళుమయ్యలేదు? రేపటి నా గతేమిటి? అన్న బెంగ, బాధ శంకరయ్య గుండెల్ని పిండేస్తోంది.

కాలం ఎవరి కోసం ఆగదు. జరగవలసినవన్నీ జరగాలి. శంకరయ్యని బలవంతాన లేవదీసి పార్వతమ్మ శవాన్ని ఎత్తారు. ఊళ్ళో వున్న బంధు మిత్రులంతా ఆ శవం వెనుక ఊరేగింపులా బయలుదేరారు. ఆ ముత్తయిదువుని సాగనంపుతూ ఊరి జనం విలపించారు. అందరి మనసుల్ని కదలింపజేసిన పార్వతమ్మ లక్షాధికారిణి కాదు. కోటీశ్వరులకి పట్టని రాజపూజ్యం మధ్యతరగతి మంచి మనసు గల వ్యక్తులకి పడుతుందనడానికి నిదర్శనం పార్వతమ్మ అంతిమయాత్రే.

వెనక రిక్షాలో వెళ్తున్న శంకరయ్యని ఈ దృశ్యం కదిల్చివేస్తోంది. "ఎంత అదృష్టం నా పార్వతిది! మంచితనానికి పట్టే అదృష్టం అన్నింటికన్నా గొప్పది" అనుకున్నాడు.

కాటి మీద పెట్టిన పార్వతమ్మ మెడలో బొందు తాడుకి కట్టిన పుస్తెల్ని తీసి శంకరయ్య చేతిలో పెట్టారు.

"నా చేతుల్తో కట్టిన పుస్తెల్ని మళ్ళీ నాకే ఇచ్చేసి వెళ్ళిపోతున్నావా? దీంతో మూడుముళ్ళ బంధం అయిపోయినట్లేనా?" అంటూ వాటిని గుండెల కద్దుకుని గోలపెట్టసాగాడు.

"బాబుగారూ! రావాలి. మీరే ఆ తల్లికి కొరివి పెట్టాలి" అన్న బ్రాహ్మడి మాటలకి ఉలిక్కిపడ్డాడు. "ఏమిటి? ఇది కూడా నేనేనా? అవును ఉన్న ఒక్క కొడుకు వెళ్ళిపోయాడుగా! అంతా అపసవ్యమే!" అంటూ ఇద్దరి సహాయంతో లేచి వెళ్ళి ఆమె తల వద్ద నిప్పు పెట్టాడు.

అంతే– అంతవరకు శరీర రూపంలో కనిపించిన పార్వతమ్మ మంటల మధ్య నిశ్చింతగా నిద్రిస్తూ ఆహుతి కాజొచ్చింది. మంటలు చుట్టూ కమ్ముకుంటున్నాయి. శంకరయ్య మనసు గిలగిల్లాడిపోతోంది. "చిన్న నిప్పు రవ్వ శరీరం మీద పడితే 'అమ్మో!' అంటాం. అలాంటిది శరీరమంతా అలా కాలిపోతుంటే ఎంత నిర్మలంగా పడున్నావు పార్వతీ! ఆ మంటలు చూస్తుంటే నా శరీరం మండిపోతోంది. నువ్వెలా తట్టుకుంటున్నావు?" అని బాధపడసాగాడు. మళ్ళీ "ఈ బాధలు, బెంగలు గాలి రూపేణా వుండే శరారీనికే" అనుకున్నాడు.

"ఇక పదండి శంకరయ్యగారూ! కపాళ మోక్షం అయింది లేవండి" అన్నారంతా. "ఆఖరిసారిగా పార్వతి చితికి నమస్కరించి వస్తా. బ్రతికుండగా ఎన్నడూ నమస్కరించలేదు. నా కంటే చిన్నది కదా! ఆఖరిసారిగా ప్రదక్షిణం చేసి వస్తా"నంటూ లేచాడు. "నడవలేరు" అన్నారెవరో. "లేదు నడవగలను" అంటూ గబగబా వెళ్ళి చితి చుట్టూ రెండు ప్రదక్షిణలు చేశాడు. మూడోసారి తిరుగుతూ కుప్పలా కూలబడిపోయాడు. "అయ్యో శంకరయ్య, శంకరయ్య" అన్నారంతా. కానీ అప్పటికే శంకరయ్య ప్రాణం పార్వతమ్మ ప్రాణంతో కలిసిపోయింది. అనుకోని ఈ హఠాత్ సంఘటనకి అంతా అచేతనులయ్యారు.

ఈ బంధాన్ని ఎవ్వరూ విడదీయలేరు. ఇటువంటి చావు కోరుకుంటే వచ్చేది కాదు. శంకరయ్య బాధ, బెంగ ఆ దేముడే తీర్చేశాడు. పార్వతీ పరమేశ్వరుల వంటి దంపతుల్ని విడదీయలేని కాలం కూడా వీరి ముందు తలొగ్గింది" అంటూ శంకరయ్య శవాన్నెత్తి మండుతున్న పార్వతమ్మ శరీరం పక్కనే వుంచి నమస్కరించారు.

"పాపం అంతా అపసవ్యమే! ఈ కుటుంబంలో అంతా అపసవ్యంగానే జరిగింది. ఈ సహగమనమూ అంతే!" అనుకున్నారంతా కళ్ళొత్తుకుంటూ. ■